క్లుప్తంగా

గోస్పాడు ఎస్‌ఐగా వెంకటప్రసాద్



గోస్పాడు: మండల ఎస్‌ఐగా వెంకటప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి గడివేములకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న వెంకటప్రసాద్‌ను ఇక్కడికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ఐకమత్యంతో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు.

కోటేష్‌కు ఫొటోగ్రఫీ దినోత్సవ పురస్కారం



కోటేష్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, ఫొటోగ్రాఫర్ చింతలపల్లె కోటేష్‌కు లయన్స్‌క్లబ్, కళారాధన కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ పురస్కారాన్ని సోమవారం అందజేసి ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ సామాజిక సమకాలిన అంశాలపై తన కుంచతో చైతన్యం కలిగించే చిత్రాలు వేయడంలో మేటి అని కొనియాడారు. క్లబ్ జోనల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, రమేష్, నాగరాజు, తోటశ్రీనివాసులు, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తనిఖీ



ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని గోడిగనూరు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సుచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివమోహన్, ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బారాయుడు, ఏఎన్‌ఎం చెంచులక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


అన్నగా అండగా ఉంటా



మాట్లాడుతున్న ఎస్‌ఐ చిన్న పీరయ్య

శిరివెళ్ల: అన్నగా అండగా ఉంటానని ఎస్‌ఐ చిన్న పీరయ్య అన్నారు. రక్షా బంధన్‌ను పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి బాలికలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనను అన్నగా భావించి ఏ సమస్య ఎదురైనా చెప్పుకోవచ్చన్నారు. టీచర్లు, తల్లిదండ్రుల మాటలను విని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. ఈవ్ టీజింగ్, ప్రేమ అంటు బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్, టీచర్లు పాల్గొన్నారు.

మత్తుకు అలవాటు పడితే భవిష్యత్ నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌రెడ్డి

చాగలమర్రి: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందని చాగలమర్రి ఎస్‌ఐ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌వీఎంవీఎస్‌ఆర్ జూనియర్ కళాశాలలో మహిళల భద్రత, బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబులేసు, జీఎంఎస్‌కె ప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ

ఆళ్లగడ్డ : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్యాలయంల్లో వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయమే ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి ఆప్యాయత చాటుకున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- పీజీఆర్‌ఎస్ అర్జీలకు గడువులోపు పరిష్కారం చూపాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 150 అర్జీలు



దివ్యాంగుడితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత నిచ్చి నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులు సంతృప్తిపడేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో 150 మంది తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

కొన్ని సమస్యలు..

- బండి ఆత్మకూరు మండలం నారాయణాపురం గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తాను 9 సంవత్సరాలుగా ఆయాగా, తన భర్త 11సంవత్సరాలుగా నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నామని, ఏజెన్సీ వారు విధుల నుంచి తొలగించేలా చూస్తున్నారని, తమకు ఎలాంటి జీవనాధారం లేదని ఉద్యోగాలు కొనసాగేలా చూడాలని తిరుపాలమ్మ జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు.
- నంద్యాల మండలం కానాల గ్రామం 1వ వార్డులో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో ఇళ్లు కట్టుకున్నామని, కాలనీకి తూర్పు దిశలోనున్న స్థలంలో నీరు నిల్వ ఉండకుండా సిమెంట్ రోడ్లు వేసి ఇరువైపులా కాలువలు నిర్మించాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

పలుమార్లు వేడి చేసిన నూనె వినియోగాన్ని నిషేధించండి

నంద్యాల(అర్బన్): పలుమార్లు అధికంగా వేడి చేసిన ఆయిల్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చెడు కొలెస్ట్రాల్‌తో పాటు వివిధ అనారోగ్య సమస్యలు వస్తాయని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా మూడు పర్యాయాలు వేడి చేసిన ఆయిల్ డెమోను సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2006 ప్రకారం హోటళ్లు, రెస్టారెంట్లు, హాట్ చిప్స్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వినియోగించే ఆయిల్ అధికసార్లు మరిగించి (టోటల్ పోలార్ కంపోనెంట్) టీపీసీ మీటర్ ప్రకారం 25 శాతానికి మించి ఉన్న ఆయిల్ వాడకంతో చెడు కొలెస్ట్రాల్‌తో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఆయిల్‌ను మూడు సార్లు వాడిన తర్వాత టీపీసీ మీటర్ ద్వారా పరీక్షించి 25 శాతం కంటే తక్కువ ఉంటే వినియోగించుకోవాలన్నారు. మరిగించిన ఆయిల్‌లో తాజా నూనెలు వేసి వినియోగించరాదని చెప్పారు. సాధ్యమైనంత వరకు వీధుల్లో విక్రయించే తినుబండారాలకు స్వస్తి పలకాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భ్రమరాంబాదేవికి ఊయల సేవ



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

పల్లకీ ఉత్సవం

శ్రీశైల దేవస్థానంలో సోమవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజులలో (సర్కారీ సేవగా) జరిపించబడుతోంది. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని జరిపారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

వైభవం..మహానందీశుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల(అర్బన్): మహానందిలో పవిత్ర శ్రావణ పౌర్ణమి, సోమవారం సందర్భంగా శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా కామేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు, మహాలక్ష్మి హోమం జరిపించారు. అనంతరం పాణ్యంకు చెందిన వసంతకు మార్‌శర్మ, పద్మావతి దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అప్పల బాధతో కౌలురైతు ఆత్మహత్య



రమణ(ఫైల్)

దొర్నిపాడు: అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన దొర్నిపాడులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. రమణ(35) మూడేళ్లుగా కౌలుకు పొలాన్ని తీసుకొని పత్తి, మిరప తదితర పంటలు సాగు చేసేవాడు. అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడులు సరిగా రాక అప్పులు పెరుగుతూ వచ్చాయి. సుమారు రూ.10లక్షల వరకు అప్పు ఉండటంతో ఇక తీర్చలేనన్న భయంతో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన ఇరుగు పొరుగు వారు వెంటనే ఉరి నుంచి తప్పించి ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పకడ్బందీగా గ్రామ సభలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

ఉయ్యాలవాడ : మండలంలో ఈ నెల 23న నిర్వహించనున్న గ్రామాభివృద్ధి ప్రణాళిక గ్రామ సభలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతోసమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు వచ్చే బడ్జెట్, సర్పంచ్‌లు విధులు, బాధ్యతలు, అత్యవసర నిధుల వ్యయంపై గ్రామ సభలు నిర్వహించి చర్చించాలని సూచించారు. పన్నుల అమలుకు గ్రామ సభల్లో తప్పనిసరిగా ఆమోదం పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మహేంద్రారెడ్డి, ఏపీఓ రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో వర్షం



సంతలో నిలిచిన వర్షపు నీరు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు పలుగ్రామాల్లో సోమవారం గంట సేపు వర్షం కురిసింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కాస్త ఉపశమనం లభించింది. సోమవారం మండల కేంద్రమైన రుద్రవరం మార్కెట్‌లో సంత వర్షం కారణంగా బురదమయం అయ్యి ప్రజలు సరుకులు, కూరగాయలు కొనుగోలు చేయడంలో ఇబ్బందులు పడ్డారు.

మొరాయించిన వీడియో పరికరాలు

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో వీడియో పరికరాలు సోమవారం మొరాయించాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల సమయంలో అధికారులందరూ స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వీడియో పరికరం పని చేయకపోవడంతో ఇక్కడ వున్న అధికారులందరూ రెవెన్యూ కార్యాలయానికి తరలివెళ్లారు. అక్కడ కూడా అదే పరిస్థితి ఉండటంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు 12 గంటల తరువాత వీడియో పరికరం పని చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): వలంటీర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం యూనియన్ అధ్యక్షుడు తిరుమలేష్, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్ ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల హయంలో వలంటీర్లకు రూ.10వేలు, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి వలంటీర్లను నట్టేట ముంచడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. మూడు నెలలు కావస్తున్నా గౌరవ వేతన బకాయిలు చెల్లించలేదన్నారు. పట్టణంలో దాదాపు వెయ్యి మందికి పైగా వలంటీర్లు ఉంటే 700 మందికి పైగా మహిళలే ఉన్నారన్నారు. రాజకీయాలతో ముడిపెట్టకుండా వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, భాగ్యలక్ష్మి, అబ్దుల్, తేజ, హిమబిందు, గీత, రెహనా, అలీబాషా పాల్గొన్నారు.

23న గ్రామ సభలు నిర్వహించాలి

నంద్యాల(అర్బన్): ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో ఈనెల 23వ తేదీన గ్రామ సభలు నిర్వహించాలని డీపీఓ మంజులవాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు ఆయా గ్రామ సభల్లో సర్పంచ్, వార్డు మెంబర్లు, రైతులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో పాటు ఉపాధి కూలీలు గ్రామాల్లో పనిచేస్తున్న ఆయా శాఖల సిబ్బంది పాల్గొనాలని సూచించారు. ఇప్పటి వరకు పథకం ద్వారా గ్రామంలో చేసిన పనుల వివరాలు, 2024–25లో చేపట్టనున్న పనులకు గ్రామసభ ఆమోదం తీసుకోవాలని ఆదేశించారు.

వివాహిత అదృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరుకు చెందిన గురు ఝాన్సీ అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వరప్రసాదు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన మేరకు వివరాలు.. ఝాన్సీ మూడు రోజుల క్రితం భర్త రాజ ఓబులేసుతో గొడవ పడి శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలోని పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి ఇరువురు కుమార్తెలతో వెళ్లింది. అయితే ఇంత వరకూ తిరిగి రాలేదు. అటు పుట్టింటికి కూడా వెళ్లలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం గాలించినా ఫలితం దొరకలేదు. విషయం తెలుసుకున్న ఝాన్సీ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న 16 మందిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకూ దాడులు నిర్వహించగా 16 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.73,240 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లు, నాలుగు బైక్‌లు స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగి మృతి



గిరిధర్‌కుమార్ (ఫైల్)

నంద్యాల(అర్బన్): గుండెపోటుతో విద్యుత్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం స్థానిక డీఈ కార్యాలయంలో చోటు చేసుకుంది. కార్యాలయానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌కుమార్ (61) యథావిధిగా విధుల్లోకి వచ్చారు. నలతగా ఉందంటూ సహ ఉద్యోగులకు చెబుతుండగా ఒక్కసారిగా కుర్చీలో కూలబడిపోయారు. సహ ఉద్యోగులు ఆయనను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈలు, ఏఈలు కార్యాలయ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, సహాయ కార్యదర్శి బాలవెంకట్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న మహిళలకు ఆరు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడం తగదన్నారు. శ్రమకు తగ్గ వేతనం అందకపోగా పెండింగ్ పెట్టడం దారుణమన్నారు.వర్కర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ప్రమాదబీమా సౌకర్యం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం వర్తింజేయాలని కోరారు.

1,118 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు

ఉయ్యాలవాడ : ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 2,675 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,118 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ సోమవారం తెలిపారు. పత్తి, మొక్కజొన్న, కంది, సోయాబీన్, వేరుశనగ, వివిధ రకాల పంటలకు సంబంధించి క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి 579 హెక్టార్లలో ఈ–క్రాప్ నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కామినేనిపల్లె గ్రామస్తులు

నంద్యాల(అర్బన్): 40 ఏళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కోళ్ల ఫారం షెడ్డును దౌర్జన్యంగా ఆక్రమించుకున్న ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం కామినేనిపల్లె గ్రామానికి చెందిన పలువురు కోరారు. 40 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన 36 మందికి ఎస్సీ కార్పొరేషన్ కోళ్లఫారం షెడ్డు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, కోళ్ల ఫారం షెడ్లను దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామానికి చెందిన దాసన్న, ఆల్‌ఫ్రెడ్, ప్రసాద్, దానమయ్య, ఈశ్వరయ్య, సుమన్ కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నామని, కోళ్ల దాణా నిల్వకు ఉంచిన స్థలాన్ని ప్రభాకర్ దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, అధికారులు చర్యలు తీసుకొని తమ స్థలం తమకే వచ్చేలా చూడాలని కోరారు.

నేటి నుంచి క్యూఆర్ కోడ్‌తో రైల్వే టిక్కెట్లు



క్యూఆర్ కోడ్‌ను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): గుంటూరు డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ ద్వారా టికెట్ల విక్రయాలు చేపట్టనున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. సోమవారం క్యూఆర్ కోడ్ సేవలను సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ప్రదీప్ కుమార్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర బాబులతో కలిసి ఆయన ప్రారంభించారు. నంద్యాల జిల్లా పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని నంద్యాల స్టేషన్ మాస్టర్ దొరబాబు తెలిపారు. నగదు రహిత సేవలను అందించేందుకు వీలుగా రైల్వే శాఖ ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు.

మహానందీశుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి శ్రీకామేశ్వరి దేవి సమేత మహానందీశ్వర స్వామికి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేయించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాలు తగదు

నంద్యాల(అర్బన్): దేశంలోని రైతులు, వ్యవసాయ రంగాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలు, బడా వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలకం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. మహానంది మండలం గాజులపల్లెలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తూ కార్పోరేట్ కంపెనీలకు ప్రాధాన్యతను ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుల ఆత్మహత్యలను అరికడతానని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతు సంక్షేమానికి మరిచిందన్నారు. కోటకొండ బాషా, మద్దిలేటి, రాజశేఖర్‌నాయక్, ఇమామ్ హుసేన్, కేషాలు, నాగరాజు, నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో సంస్కృత భాషా దినోత్సవం హయగ్రీవా జయంతి అనే అంశంపై సాంస్కృత సాహితీ సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డు జడ్జి కాశిబట్ల శివప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ అత్యంత ప్రాచీన భాష సంస్కృతమన్నారు. ప్రపంచ భాషల వ్యాకరణ గ్రంథాలకు మార్గదర్శకం పాణిని అష్టద్యాయి అని చెప్పారు. అనంతరం రిటైర్డు జడ్జిని ఘనంగా సత్కరించారు. వసంతరావు, గుప్త ఆంధ్రుస్, కృష్ణవేణమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బొమ్మలసత్రం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా సూచించారు. ఎస్పీ సూచనల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్బంగా విద్యార్థులు రోడ్డు ప్రమాదాల నివాణ, మహిళలపై జరిగే నేరాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. సైబర్ నేరగాళ్ల వలలో తల్లిదండ్రులు చిక్కుకోకుండా ఎలా జాగ్రత్తపడాలో వివరించారు.

గోవిందపల్లెపై పోలీసు నిఘా

శిరివెళ్ల: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామం గోవిందపల్లెపై పోలీస్ నిఘా పెరిగింది. ఇటీవల ఎస్పీ ఆకస్మికంగా పికెట్‌ను పరిశీలించారు. సోమవారం రాత్రి ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకరరెడ్డి గ్రామాన్ని సందర్శించి రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఘర్షణలు, గొడవలకు దూరం ఉంటూ ప్రశాంత జీవనం సాగించాలని ఇరు పార్టీల నాయకులకు సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో సీఐ వంశీధర్, ఎస్‌ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

మానవ సంబంధాల మెరుగుకు రాఖీ పండుగ

నంద్యాల(న్యూటౌన్): మానవ సంబంధాల మెరుగుకు దోహదం చేసేదే రాఖీ పండుగ అని గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ షేక్షావలి రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో రక్షాబంధన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులతో రాఖీలు కట్టించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



చిన్నయ్యస్వామి చెంచు గూడెంలో మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ పంచాయతీ మజరా చిన్నయ్యస్వామి చెంచు గూడెంలో సోమవారం వైద్య సిబ్బంది దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి గిడ్డయ్య పరిశీలించారు. వారు మాట్లాడుతూ గూడెంలో ఇది వరకు ఓ సారి ద్రావకం పిచికారీ చేశామన్నారు. ప్రస్తుతం రెండో సారి కూడా ఇంటింటికి వెళ్లి ద్రావకాన్ని పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, రుద్రవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ

ఉయ్యాలవాడ : సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గ్రామాలలో కక్షలకు, కార్పణ్యాలకు వెళ్లకుండా ప్రశాంతమైన జీవనాన్ని ప్రజలు కొనసాగించాలని కోరారు. వివాదాలకు దారి తీసే సమస్యలు వున్నా, నాయకులు బెదిరింపులకు పాల్పడినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి వుండాలి

ప్రభుత్వం నూతనంగా చట్టాలు అమలు చేసిన విధానాలపై ప్రజల్లో కూడా అవగాహన కలిగి వుండాలని ఎస్‌ఐ రామాంజనేయులురెడ్డి విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో విద్యార్థులు ప్రభుత్వం ఇటీవల నూతనంగా అమలు చేసిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.